

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

5న రామచంద్రపురంలో 'స్పందన'

ప్రజాశక్తి -అమలాపురం

రామచంద్రపురం రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు డిసెంబర్ 5వ తేదీ మొదటి సోమవారం జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీలను రామచంద్రపురంలో స్వీకరిస్తామని, రామచంద్రపురం డివిజన్ కు చెందిన అర్జీదారులు అందరూ ఈ అంశాన్ని గమనించి తమ అర్జీలను రామచంద్ర పురంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో సమర్పించాలని ఆయన ప్రకటనలో కోరారు. అలాగే వివిధ శాఖల జిల్లా అధికారులు అందరూ డిసెంబర్ 5న ఉదయం 9.30 గంటలకే రామచంద్రపురం ఆర్డిఒ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి విధిగా హాజరు కావాలన్నారు.

శిథిలావస్థలో కపిలేశ్వరపురం లాకులు

- వృథాగా పోతున్న సాగునీరు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల కేంద్రమైన కపిలేశ్వరపురంలో 1942వ సంవత్సరం బ్రిటిష్ హయాంలో నిర్మించిన లాకులు శిథిలావస్థకు చేరాయి. 36,388 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ఉద్దేశంతో నిర్మించిన లాకుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సాగు నీటి ప్రవాహాన్ని కట్టడి చేసి మెరక ప్రాంతాలకు నీరందించేందుకు నిర్మించిన ఇరిగేషన్ తలుపులకు రంధ్రాలు పడి లీకేజీల తో పెద్ద ఎత్తున నీరు వృథాగా పోతోంది.

ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో సాగునీరు కొరతతో మెరక ప్రాంతాల్లో వరిచేలకు నీరు అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు.



లాకుల తలుపుల రంధ్రాల నుంచి వృథాగా పోతున్న నీరు



మరమ్మతులకు గురైన లాకుల తలుపులు



లాకుల సిబ్బంది విధులను నిర్వహించే శిథిలావస్థకు చేరిన భవనం

పనిచేయని కంట్రోలింగ్ వ్యవస్థ

ప్రస్తుతం ఇక్కడ ఎగువ లాకులు దిగువ లాకులు తలుపులు మూతబడి తెరుచుకునే కంట్రోలింగ్ సిస్టం సక్రమంగా పనిచేయడం లేదు. ఈ లాకులకు మరమ్మతులు చేసి తలుపులకు నూతన నిర్మాణం చేపట్టాలని అధికారులు నిర్ణయించి గతంలో టెండర్లు పిలిచారు. అయితే ఆ టెండర్ ప్రక్రియ జరగక పోవడం వల్ల ఆ నిర్ణయం మాత్రం అమలుకు నోచుకోలేదు. దీంతో సాగునీరు యథావిధిగా వృథా అవుతూనే ఉంది. ఇక్కడ పనిచేసేందుకు సిబ్బంది పూర్తిస్థాయిలో లేరు.

లాకుల మరమ్మతులు చేయాలని వినతి

ప్రస్తుతం లాక్ సూపరింటెండెంట్తో పాటు ఒక లస్కర్ మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది నిర్వహించేందుకు నిర్మించిన క్వార్టర్లు శిథిలావస్థకు చేరడంతో అవి నివాసానికి పనికి రాకుండా పోయాయి. దీంతో సిబ్బంది బయట ప్రాంతాల్లో అద్దెకు ఉంటూ ఇక్కడకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతమంతా విష సర్పాల కు నిలయంగా మారడంతో సిబ్బంది భయం గుప్పెట్లో విధులు నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్పందించి లాకులకు మరమ్మతు పనులతో పాటు సిబ్బంది నివసించేందుకు క్వార్టర్లు నిర్మించాలని రైతులు, సిబ్బంది కోరుతున్నారు.

విద్యతో పేదరిక నిర్మూలన

ప్రజాశక్తి-అమలాపురం

విద్యతో పేదరిక నిర్మూలన సాధ్యమని జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్. సత్తిబాబు అన్నారు. బుధవారం సిఎం జగన్ వర్చువల్ విధానంలో అన్నమయ్య జిల్లా మదనపల్లి నుంచి నాలుగో విడత పూర్తి ఫీజు రియింబర్స్మెంట్, జూలై 2022 నుంచి సెప్టెంబర్ 22 త్రైమాసికానికి సంబంధించిన విద్యా దీవెన నిధులను విద్యార్థినీ, విద్యార్థుల తల్లుల ఖాతాకు నేరుగా డిబిటి విధానంలో బటన్ నొక్కి జమ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జూలై నుంచి సెప్టెంబర్ 2022 త్రైమాసికానికి గాను 38,145 మంది విద్యార్థులకు లబ్ధిని చేకూర్చుతూ రూ.25,64,64,709 తల్లుల ఖాతాకు ముఖ్యమంత్రి జమ చేశారన్నారు. కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ అధికారి పి.జ్యోతిలక్ష్మి దేవి, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, ఎంపిపి కె.భాగ్యలక్ష్మి, హితకారిణి సమాజం చైర్మన్ కాశీ మునికుమారి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్లో లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న దృశ్యం

విద్యాదీవెనతో పేదలకు చేయూత

అంబాజీపేట పేద విద్యార్థులు ఉన్నత చదువులకై జగనన్న విద్యా దీవెన ఆర్థిక చేయూత నిస్తుందని ఎంపిపి, జెడ్పిటిసి సభ్యులు దొమ్మేటి వెంకటేశ్వరరావు, బూడిద వరలక్ష్మి లక్ష్మీపతి పేర్కొన్నారు. అంబాజీపేట ఎస్ఎన్ఎమ్ కళాశాలలో బుధవారం జగనన్న విద్యా దీవెన నాలుగవ విడత చెక్కు కార్యక్రమానికి ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు సోదరుడు, పి.గన్నవరం నియోజకవర్గ బూత్ కన్వీనర్ అధ్యక్షులు కొండేటి వెంకటేశ్వరరావు, తనయుడు కొండేటి వికాస్ లు ముఖ్య అతిథులుగా విచ్చేసి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన సంక్షేమమే జగనన్న లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఉన్నత చదువులు చదివే విద్యార్థులు జగనన్న దీవెనతో ఉన్నత లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ఎంఎల్ఎ సోదరుడు, తనయులకు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో పేరి శ్రీను, నాగవరపు నాగరాజు, దొమ్మేటి సత్యమోహన్, అప్పన శ్రీను, మట్టా వెంకటేశ్వరరావు, కళాశాల డైరెక్టర్ ఎమ్.సాయి ప్రసాద్, ప్రిన్స్పల్ తరుణ్ కుమార్, రాధామణి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులుఅందజేస్తున్న ఎంఎల్ఎసోదరుడు, తనయుడు

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -అమలాపురం

స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాల్లో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకే షన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రామ్ కింద కార్యకలాపాలైన ఎన్నికల జాబితాలో పేరు నమోదు, ఓటు హక్కు విశిష్టత గురించి విద్యార్థుల కు బుధవారం అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఓటర్గా నమోదుకు అర్హత తేదీ 2023 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండుతున్న ప్రతి ఒక్కరు ఓటర్ గా నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఆర్డిఒ ఎన్ఎస్విబి. వసంతరాయుడు, మున్సిపల్ కమిషనర్ విఐపి నాయుడు స్థానిక తహశీల్దార్ పి.శ్రీ పల్లవి, కళాశాల ప్రిన్సిపల్ మనోహర్, కళాశాల కరస్పాండెంట్ నరసింహా రావు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మహాకవి గురజాడకు ఘన నివాళి

ప్రజాశక్తి-మండపేట

స్థానిక సంగమేశ్వర కాలనీలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి బుధవారం నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పాఠశాల హెచ్ఎం చిట్టూరి వెంకట శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ గురజాడ కన్యాశుల్కం, బాల్య వివాహాలు వంటి సాంఘిక దురాచారాలపై రచనల సాగించడమే కాకుండా తెలుగులో వ్యావహారిక భాషలో రచనలు సాగించి, కన్యాశుల్కం నాటకంతో ప్రపంచానికి తెలుగు సాహిత్యం గొప్ప తనాన్ని పరిచయం చేశారన్నారు. అనంతరం విద్యార్థులు దేశమును ప్రేమిం చుమన్నా గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోణం సునీత, పావులూరి శేషారత్నం పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

90వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-అమలాపురం

చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి రొడ్డ భవానీ మృతికి కారకులను అరెస్ట్చేయాలని కోరుతూ భవాని న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 90వ రోజుకు చేరుకున్నాయి. దీక్షకు మద్దతు తెలిపిన జనసేన వీర మహిళలు మాట్లాడుతూ రొడ్డ భవానీ మృతికి కారకులను అరెస్టు చేయకుండా ప్రభుత్వం కాపాడుతుందనీ ఆరోపించారు. భవాని కుటుంబానికి ఉద్యమానికి అండగా ఉంటామన్నారు. దీక్షకు మద్దతు తెలిపిన వారిలో ఎంపిటిసి సభ్యురాలు పల్లె శాంతి, తిక్కా సరస్వతి, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, నామాడి శివాజీ, విసికె పార్టీ జిల్లా అధ్యక్షులు బొంతు రమణ, మెండి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- ఐ.పోలవరం

పాతఇంజరం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గణేష్ నగర్ కు చెందిన లంక సుబ్బారావు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. బాధితుడిని ఎంపిపి మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పిటిసి సభ్యులు ముదునూరి సతీష్ రాజు బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట వైసిపి గ్రామకమిటీ అధ్యక్షుడు కొండేపూడి కపావర ప్రసాద్, చప్పిడి బుజ్జి, కార్యకర్తలు ఉన్నారు.

'ఉద్యమాలు, పోరాటాలతో కోర్కెల సాధన'

ప్రజాశక్తి -అమలాపురం

ఉపాధ్యాయులు తమ కోర్కెలు నెరవేర్చుకోవడానికి కాళ్ళు పట్టడం నేర్చుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను ఎంఎల్సి ఐవి ఖండించారు. విజయవాడ నుంచి బుధవారం రాత్రి అమలాపురం చేరుకుని నిరసన జాగరణలో పాల్గొని ఎంఎల్సి ఐవి మాట్లాడూతూ ఉపాధ్యాయులు కాళ్ల పట్టుకుని కాకుండా, ఉద్యమాలు, పోరాటాల ద్వారా తమ న్యాయమైన కోర్కెల ఎలా సాధించుకోవాలో తెలుసునని అన్నారు. రాజకీయ నాయకులు కాళ్ల పట్టుకోవడం ద్వారానే ఉన్నత పదవులు పొందుతారేమోగాని ఉపాధ్యాయులకు ఆ అవసరం లేదన్నారు. విజయవాడలో యుటిఎఫ్, ఎంఎల్సిలు ఉపాధ్యాయుల అరెస్టులకు నిరసనగా జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద సాయంత్రం 5 నుంచి రాత్రి 12 గంటల వరకు నిరసన జాగరణ ప్రారంభించారు. దీనికి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు పి.మురుగేశ్వరరావు, బి.చంద్రకళ, పివి.విశ్వప్రసాద్ సారథ్యం వహించారు. అమలాపురం సమీప మండలాల నుండి సుమారు రెండు వందల మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నాయకులు కె.సత్యనారాయణ డి.శ్రీరామ్మూర్తి, ఎం.వేంకటేశ్వర రావు, ఆర్. రామారావు తదితరులు మాట్లాడారు. ఈ నిరసన శిబిరానికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కారెం వెంకటేశ్వరరావు మెడికల్ రిప్స్ అసోసియేషన్ నాయకులు ఎమ్.శ్రీనివాసరావు ఎస్ఎన్వి.పోలేశ్వరరావులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** విజయవాడలో ధర్నాని ప్రభుత్వం పోలీసులతో భగ్నం చేయడాన్ని నిరశిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం హైస్కూల్ సెంటర్లో ఉపాధ్యాయుల ఆందోళన చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జె.సత్యనారాయణ, కె.రాము, సిఐటియు నాయకులు టి.దుర్గ ప్రసాద్, సఖిలే సూర్యా నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **మండపేట** విజయవాడలో ధర్నా చేసేందుకు వెళ్లిన యుటియఫ్, పిడిఎఫ్ ఎంఎల్సిలు, ఉపాధ్యాయులను అరెస్టు చేయడం అప్రజాస్వామని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు డి.వి.రాఘవులు, కె.గోపాలకృష్ణ రెడ్డి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం ఐదు నుంచి రాత్రి 12 గంటల వరకు ఉపాధ్యాయుల అరెస్టులకు నిరసనగా సిఐటియు, యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన జాగరణ కార్యక్రమం చేపట్టారు. అరెస్టు అయిన ఉపాధ్యాయులను వెంటనే విడుదల చేయాలని కోరారు. నూతన విద్యా విధాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండపేట పట్టణ, మండల, కపిలేశ్వరపురం మండలాల యుటిఎఫ్ శాఖల అధ్యక్ష, కార్యదర్శ, సభ్యులు పాల్గొన్నారు. **రాజోలు** విజయవాడలో ఉపాధ్యాయుల అక్రమ అరెస్టులకు నిరసనగా బుధవారం ఉపాధ్యాయులు రాజోలులో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. రాజోలు మండల రిసోర్స్ సెంటర్ నుండి పాదయాత్రగా గాంధీ బొమ్మ సెంటర్ కు చేరుకుని కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. రాజోలు,మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు, పి.గన్నవరం యూటీఎఫ్ శాఖల ఆధ్వర్యంలో నిరసన జాగరణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కె.రాజబాబు, కె.బాలకష్ణ, అడబాల కాశీ విశేశ్వర రావు, సిహెచ్. కేశవరావు, రాజబాబు, అడబాల శ్రీమన్నారాయణ, కె.రామ దుర్గారావు, ఎం.నరసింహ రావు, బి.రాచయ్య, జివిఎంఎస్.గుప్తా తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో నిరసనలో పాల్గొన్న కృష్ణవేణి, రాఘవులు, గోపాలకృష్ణారెడ్డి



అమలాపురంలో జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్సి ఐవి

ఉపాధ్యాయుల అరెస్టులకు సిపిఎం ఖండన

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్రంలో ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన పిఎఫ్, డిఎ ఎరియర్స్ తదితర బకాయిలు చెల్లించాలని విజయవాడ ధర్నాచౌక్లో ఉపాధ్యాయులు తలపెట్టిన ధర్నాను అడ్డుకొని అరెస్టు చేయడాన్ని సిపిఎం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ బుధవారం ఒక ప్రకటనలో ఖండించింది. పిఆర్సి చర్చల సందర్భంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.650 కోట్లు మార్చి 2022నాటికి క్లియర్ చేస్తామని మంత్రివర్గం ఉపసంఘం సమక్షంలో ఆర్థిక శాఖ అధికారులు హామీ ఇచ్చారు. కానీ నేటి వరకు పూర్తి బకాయిలు చెల్లించలేదు. మంజూరైన పిఎఫ్, తదితర లోన్లు జమ చేయకపోవడం, సిపిఎస్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించకపోవడం, రిటైర్ అయిన వారి బెనిఫిట్స్ చెల్లించకపోవడం తదితర సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో శాంతియుతం గా ధర్నా చేస్తున్నారు. పోలీసులు ఈ ధర్నాను అడ్డుకొని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఎస్ఎస్వి.ప్రసాద్, అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లుతో సహా 250 మందికిపైగా అరెస్టు చేశారు. ముందురోజు జిల్లాల్లో ఉపాధ్యాయులకు నోటీసులు ఇచ్చారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని, ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యలు మాను కుని తను హామీ ఇచ్చినట్లుగా ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించా లని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల డిమాండ్లకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తెలిపారు. **అమలాపురం** న్యాయబద్ధంగా రావలసిన బకాయిల కోసం విజయవాడలో ధర్నా చేస్తున్న పిడిఎఫ్ ఎంఎల్సిలను, యుటిఎఫ్ కార్యకర్తల అరెస్టులకు యుటిఎఫ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబసు ఖండించారు. పర్మిషన్ ఇచ్చి, ధర్నా ను జరగనీయకపోవడం అప్రజాస్వామిక చర్య అన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ, నాయకులు

అన్ని రంగాల్లో వెనుకబడిన రాష్ట్రం

ప్రజాశక్తి-మండపేట

రాష్ట్రంలో అవగాహనా రాహిత్యంతో పరిపాలన కొనసాగుతోందని, రాష్ట్రం అన్నీ రంగాలలోని అన్నిరకాలుగా వెనుకబడిపోయిందని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను ఆయన పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మండపేట నియోజకవర్గంలో డిసెంబర్ 2వ తేదీ నుంచి 50 రోజుల పాటు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం మొదటిగా నదురబాద గ్రామంలో ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి ఈ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి, ప్రజాభిప్రాయాలను సేకరించి ప్రజా సమస్యలను చంద్రబాబుకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్ పర్సన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, గడి రాంబాబు, తెల్లాకుల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పథకాల అమలు కష్టంగా ఉందట..
అందుకే రోజుకో సలహా ఇస్తున్నారు..!!

వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-కాట్రేనికోన

చెయ్యేరులోని శ్రీనివాసా స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి పి.సంపత్ గణేష్ ఇటీవల గుంటూరులో జరిగిన జెఎన్టియుకె సౌత్ జోన్ అంతర్ యూనివర్శిటీ వాలీబాల్ ఛాంపియన్ షిప్ సెలక్షన్లో ప్రతిభ కనబరచినాడు. బిటెక్ మూడో ఏడాది చదుతువున్న ఇసిఇ విద్యార్థి సంపత్ గణేష్ చెన్నైలో డిసెంబర్ 23 నుంచి 27వరకు జరిగే సౌత్ జోన్ అంతర్ యూనివర్సిటీ వాలీబాల్ ఛాంపియన్ షిప్నకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభ లో కళాశాల కరెస్పాండెంట్ డివిఎన్ఎస్.వర్మ ఎంపికైన విద్యార్థి గణేష్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రత్నరాజు, పాలకవర్గ సభ్యులు రమేష్ రాజు, సందీప్ లు, కళాశాల ఫీజికల్ డైరెక్టర్ అలీ తదితరులు పాల్గొన్నారు.



గణేష్ను అభినందిస్తున్న దృశ్యం

నేడు పోలీసు ఉద్యోగాల సాధనపై అవగాహన

ప్రజాశక్తి - అంబాజీపేట

అమలాపురం అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో డిసెంబర్ 1న గురువారం పోలీసు ఉద్యోగాల సాధనపై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు మొకా సత్తిబాబు అవగాహన కల్పిస్తారని అంబాజీపేట మండల షెడ్యూల్డ్ కులాల సంఘం అధ్యక్షులు నందిక వెంకటేశ్వరరావు, కార్యదర్శి పెట్టా వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నమూనా పరీక్షలో ప్రతిభ కనబరిచిన మెదటి 50 మందికి ఉచితంగా కోచింగ్ ఇస్తారని అలాగే స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తారని తెలిపారు.

జూనియర్ సివిల్ జడ్జి దీపకృపకు డాక్టరేట్

ప్రజాశక్తి - ఆలమూరు

గృహ హింస, చట్టాలు, న్యాయపరమైన అంశాలపై నిశితంగా పరిశీలించి, పరిశోధనల ద్వారా 'లా'లో పిహెచ్డి చేసి ఎయు నుంచి ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి దీపా దైవ కృప గౌరవ డాక్టరేట్ పొందారు. బుధవారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కోర్టు సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు. 2010లో జూనియర్ సివిల్ జడ్జిగా ఆమె బాధ్యతలు చేపట్టారు. ఆమె స్వగ్రామం కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వేలేరు గ్రామం.



దీపా దైవ కృష

సిసి రోడ్డు, డ్రైన్ నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం పురపాలక సంఘ పరిధిలో 3 వార్డు నందు సిసి రోడ్డు, డ్రైన్ నిర్మించుటకు శంకుస్థాపన బుధవారం మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి ఆధ్వర్యంలో జరిగింది. పట్టణ వైసిపి అధ్యక్షుడు సంసాని వెంకట చంద్రశేఖర్, వైస్ చైర్మన్లు రుద్రరాజు వెంకటరాజు, తిక్కిరెడ్డి వెంకటేష్, కమిషనర్ అయ్యప్ప నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న చైర్మన్

రైతులకు సేవలు అందించేందుకు కృషి

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు కృషి చేస్తానని వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్శిటీ బోర్డు సభ్యునిగా నియమితులైన నంగవరం సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఆర్బికె చీఫ్ కమిషనర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య నుంచి బుధవారం సర్పంచ్ వెంకటేశ్వరరావుకు నియామక పత్రాలు అందాయి. తన నియామకానికి కృషిచేసిన మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ,రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ,వైసిపి జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

తాపేశ్వరం మీదుగా బస్సులు నడపాలి

ప్రజాశక్తి-మండపేట

ఆర్టిసి బస్సులను మండపేట తాపేశ్వరం, ఇప్పనపాడు మీదుగా నడపాలని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు డిమాండ్ చేశారు. తాపేశ్వరం చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఆర్ అండ్బి డిఇతో మాట్లాడుతూ పనులు ఆరంభించి నెల రోజులు దాటినా నేటికి 400 మీటర్ల సిసి రోడ్డు మాత్రమే వేస్తే ఎలా అని ప్రశ్నించారు. పనులు వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. దుమ్ము, ధూళి, రవాణా అసౌకర్యాలతో ఇక్కడి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. లారీలు, ఇతర పెద్ద వాహనాలను దారి మళ్లించి ఆర్టీసీ, స్కూల్ బస్సులకు మాత్రం అవకాశం కల్పించాలన్నారు. తద్వారా ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు విద్యార్థులు, ప్రజలకు ఇబ్బందులు వుండవన్నారు. ఆయన వెంట గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.



బుల్లియ్య ను పరామర్శిస్తున్న నాయకులు

గోపవరం సర్పంచ్కు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

భార్యా వియోగంతో బాధపడుతున్న గోపవరం సర్పంచ్ కుంచే బల్లియ్య (బాబాయ్)ను సర్పంచ్ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, భీమనపల్లి సర్పంచ్ పెయ్యల రాజకుమార్, ఎంపిటిసి సభ్యుడు కొంకి ఏడుకొండలు తదితరులు పరామర్శించారు. బుల్లియ్య భార్య శారద(65) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. సర్పంచ్ బుల్లయ్య, కుమారుడు స్వామి, కుటుంబ సభ్యులను నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, చెల్లుబోయిన శ్రీను, జి.సురేష్ బాబు, ఓగూరి విజయకుమార్ తదితరులు పరామర్శించారు.



ప్రతిపాడులో ప్రచార రథంపై ప్రచారం చేస్తున్న వరుపుల రాజా, టిడిపి నాయకులు

ప్రభుత్వ వైఫల్యాలపై టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

పాలక ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎండగట్టేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ వరుపుల రాజా అన్నారు. ఈ మేరకు ప్రత్యేకంగా తయారు చేసిన ప్రచార రథాన్ని ఆయన ప్రత్తిపాడులో బుధవారం ప్రారంభించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రజలకు ఉపాధి అందించే పరిశ్రమలు మూతపడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైఫల్యాలను మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం తెలియజేసేందుకు ప్రచార రథం వినియోగిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



లింగంపర్తిలో వైసిపి సమావేశంలో వరుపుల సుబ్బారావు

మాజీ ఎంఎల్ఎ ఇంట కోలాహలం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలం లింగంపర్తి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు గృహం బుధవారం కోలాహలంగా మారింది. వైసిపి అధిష్టానం వరుపుల సుబ్బారావును అనపర్తి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా నియమించారు. దీంతో వైసిపి అసంతృప్తి వర్గంతో పాటు మాజీ ఎంఎల్ఎ ముఖ్య అనుచరులు లింగంపర్తికి క్యూ కట్టారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా ఉండి 2024లో ప్రతిపాడు నియోజకవర్గానికి వైసిపి జెండా ఎగరవేద్దామని పిలుపునిచ్చారు. ఏలేశ్వరం, రౌతులపూడి ఎంపిపిలు గొల్లపల్లి బుజ్జి, మల్ల రాజు ఖర్జీ, వైకాపా నియోజకవర్గ బీసీ నాయకుడు వాసిరెడ్డి జమీల్, కొప్పుల బాబ్జి, ఒలేటి చంటిబాబు, సర్పంచులు ఎంపిటిసిలు ఎంఎల్ఎని కలిసిన వారిలో ఉన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రతి రైతు తక్కువ ఖర్చుతో తయారయ్యే సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కలిగి ఉండాలని ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త నరసింహారావు అన్నారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో రైతులకు నిర్వహించిన పొలంబడి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా ఇచ్చేశారు. సేంద్రియ పద్ధతిలో తయారు చేసిన ఎరువులు వినియోగించడం తక్కువ ఖర్చుతో న్యాయమైన దిగుబడి పొందవచ్చు అని తెలిపారు. మరో శాస్త్రవేత్త శర్మ మాట్లాడుతూ కీటక నివారణకు సోలార్ పెన్సిల్ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఎడిఎ మాధవి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో సొంత విత్తనాల ఉత్పత్తి, విక్రయానికి చేసుకోవాలన్నారు. ఎ.ఒ వైవి గంగాధర్ రైతులకు జీవామృతం తయారీ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో వీఏ గణేష్, సిబ్బంది గణేష్, ప్రసాద్, మల్లేశ్వర, మణికంఠ, భువనేశ్వర్ ఉన్నారు.

పాదయాత్ర చేసిన శ్రీనుకు సన్మానం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లికి చెందిన కట్టా శ్రీనివాస్ ఇటీవల గండేపల్లి నుండి శబరిమల వరకు సుమారు 1500 కిలో మీటర్లు 36 రోజుల్లో పాద యాత్ర పూర్తి చేసి నందర్భంగా గండేపల్లి అయ్యప్ప స్వామి ఆలయం వద్ద కట్టా శ్రీనివాస్‌కు మేళ తాళాలతో బొల్లంరెడ్డి రామకృష్ణ, చిటికెల కన్నబాబు ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో రెడ్డి, సానిపిని తారకం, వీర మల్ల బ్రహ్మానందం, తణుకు రామచంద్ర రావు, చిన్నులు పలు వురు ఉన్నారు.



శ్రీనును సన్మానిస్తున్న గ్రామస్తులు

గృహ నిర్మాణాలకు రుణాలివ్వండి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలతోపాటు టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు రుణాల మంజూరుకు బ్యాంకర్లు సహకరించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం బ్యాంకర్ల సమావేశంలో కోరారు. ప్రధానంగా కాకినాడలో 2056 టిడ్కో ఇళ్లకు సంబంధించి 1500 మందికి ఇప్పటికే రుణాలు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం ఇంకా 300 మందికి రుణాలు మంజూరు కావాల్సి ఉందని కమిషనర్ చెప్పారు. వీరందరికీ ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా రుణాలు మంజూరు చేస్తే టిడ్కో నివాసాలు వద్ద మౌలిక సదుపాయాలు, ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేసి వచ్చే మార్చి నాటికి లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పేదలందరికీ ఇళ్ల పథకంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాలు ద్వారా పావలా వడ్డీ రుణాలు మంజూరు విషయంలో కూడా బ్యాంకర్లు తోడ్పాటును అందించాలన్నారు. ప్రస్తుతం సుమారు 4వేల మందికి ఎస్‌హెచ్‌జీ లింకేజీ ఇచ్చారని, మరో 5వేల మందికి ఇవాల్సివుందన్నారు. ఈ విషయంలో బ్యాంకర్లు తగిన సహకారం అందించి ప్రభుత్వ పథకాలు అమలులో తగిన సహకరం అందించాలన్నారు. సమావేశంలో మెప్మా పీడీ ప్రియంవద, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సీహెచ్ఎస్ ప్రసాద్, సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకటరాజు, సీవోలు, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండలం పటవల పంచాయతీలోనీ బీసీ పేటలో రాయుడు వారి ఇంటి వద్ద నుంచి దంగేటి సత్యనారాయణ ఇంటి వరకు నిర్మించబోయే డ్రైనేజీ నిర్మాణానికి ఎంపిపి రాయుడు సునీత శంకుస్థాపన చేశారు. పటవల గ్రామ పంచాయతీ నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు మూడున్నర లక్షలతో ఈ డ్రైనేజీని నిర్మించనున్నట్లు సర్పంచ్ పినపోతు చిన కామేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా బీసీ సెల్ కార్యదర్శి కొప్పిశెట్టి వెంకట్, ఎంపీటీసీ సభ్యులు తణుకు వరలక్ష్మి, సత్తిబాబు, ఉప సర్పంచ్ చెక్కపల్లి లక్ష్మణ్, గ్రామ కమిటీ కన్వీనర్ కాల వెంకటరమణ, పటవల హై స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ నరాల శ్రీనివాస్, కొటికలపూడి చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.



కోరంగి రోప్ వే బ్రిడ్జి పరిశీలిస్తున్న ఎంపిపి సునీత, అధికారులు

కోరంగి రోప్ వే బ్రిడ్జి పరిశీలన

అనంతరం కోరంగి రోప్ వే బ్రిడ్జిని ఎంపిపిడ రాయుడు సునీత బుధవారం అధి కారులతో కలిసి పరిశీలించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో కోరంగి ఎంపీటీసీ పోతుల రత్నకుమారి రోప్ వే బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందని లేవనెత్తిన విషయంపై ఎంపిపి రాయుడు సునీత స్పందించారు. మండల ఇంజనీర్ నరహరితో కలిసి బుధవారం రోపే వే బ్రిడ్జిని పరి శీలించి తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. వంతెనకు పలుచోట్ల తాళ్లు దెబ్బతిన్నాయని, రంగులు వేయించాలని గ్రామస్తులు, స్థానిక సర్పంచ్ పెయ్యల మంగేష్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, స్థానిక నాయకులు కొపనాతి నాగరాజు, దడాల పండు, నల్లి ఈశ్వరరావు, నామాడి అబ్బాయి, రొక్కం లోవరాజు, సంగాడి శ్రీనివాసు,రేకాడి వెంకటేశ్వర్లు, పేయ్యల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గడప గడపకూ..

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ 16వ డివిజన్ ఏటిమొగలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖం రెడ్డి బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్లు, అధికారులతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వివిధ అభివద్ధి, సంక్షేమ,నవరత్న పథకాలద్వారా గడచిన మూడున్నరేళ్ళలో ప్రజలకు అందించిన లబ్ధిని ప్రజలకు వివరించారు. కొంత మంది ఆకతాయిలు గంజాయి సేవిస్తున్న విషయాన్ని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా, ఆ ప్రాంతంలో సీసీ కెమేరాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మీసాల ఉదయ్‌కుమార్, నగర బీసీసెల్ అధ్యక్షుడు పేర్ల రజనీకుమార్, మాజీ కార్పొరేటర్లు పేర్ల జోగారావు, పినపోతు సత్తిబాబు, పసుపులేటి వెంకటలక్ష్మి, సంగాని నందం, కొప్పనాతి నాగసత్యనారాయణ, అధికారులు ఆయన వెంట ఉన్నారు.

ఏలేశ్వరం: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా సచివాలయ సిబ్బంది కషి చేయాలని ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆదేశించారు. మండలంలోని పేరవరంలో ఆయన బుధవారం గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సునీత ఆయన సచివాలయ, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ బేరి అరవింద కుమార్, వైసిపి మండల ఇంచార్జ్ బదిరెడ్డి గోవిందబాబు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

లోకేష్‌ను కలసిన వెంకట రమణ చౌదరి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి నారా లోకేష్‌ను బుధవారం పెద్దాపురం మాజీ ఎంఎల్ఎ కీ.శే.బొడ్డు భాస్కర రామా రావు తనయుడు బొడ్డు అనంత వెంకట రమణ చౌదరి విజయ వాడలో మర్యాద పూర్వకంగా కలి శారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న మోసాలను, ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంపై యువతలో అవగాహన కల్పించాలని ప్రభుత్వ వైఫల్యాలను నిర్భయంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని లోకేష్ సూచించినట్లు వెంకటరమణ చౌదరి తెలిపారు.



లోకేష్‌తో బొడ్డు వెంకటరమణ చౌదరి



యూనిఫాం పంపిణీ చేస్తున్న స్కూల్ చైర్మన్ రమాదేవి

విద్యార్థినులకు యూనిఫారం పంపిణీ

ప్రజాశక్తి-కరప

రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు ఎలుగుబంట్ల గోపాలకృష్ణ సమకూర్చిన రూ.18 వేల విలువచేసే యూనిఫామ్‌ను బుధవారం నక్కా సూర్యనారాయణమూర్తి ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థినులకు పాఠశాల చైర్మన్ రమాదేవి అందించారు. హెచ్ఎం యు. లీలామనోహర్, సర్పంచ్ ఆశాజ్యోతి, పిఎంసి చైర్ పర్సన్ రమాదేవి, పోలిశెట్టి తాటిలు, రాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్స్యకారుడు గల్లంతు

ప్రజాశక్తి - యు. కొత్తపల్లి



కోడా చిన్న ఫైల్ ఫోటో

ఉప్పాడ పంచాయతీ పరిధిలో గల సుబ్బంపేట కు చెందిన మత్స్యకారుడు గల్లంతైనట్లు బుధవారం స్థానికులు తెలిపారు. ఈ నెల 28వ తేదీన సుబ్బంపేట నుండి బోట్‌లో సుమారు ఎనిమిది మంది సముద్రంపై వేటకు వెళ్లగా చేపలు వేటాడే వల లాగుతున్న సమయంలో ప్రమాద వశాత్తు సముద్రంలో పడి కోడా చిన్న అనే మత్స్యకారుడు గల్లంతయినట్లు తోటి మత్స్య కారులు తెలిపారు. సంఘటన జరిగి రెండు రోజులు కావస్తున్నా నేటికీ ఆచూకీ దొరకలేదని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు .




పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నేషనల్ సాఫ్ట్ బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కరప

నేషనల్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పెద్దాపురపాడు హై స్కూల్ విద్యార్థులు ఇద్దరు బంగారు పతకాలు సాధించారని వ్యాయామ ఉపాధ్యాయులు బీవీవీ ప్రసాద్ తెలిపారు. ఈనెల 25వ తేదీ నుండి కర్నూలు జిల్లా మాంటిసోరి ఏ క్యాంప్ వేదికగా జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడలు జాతీయ స్థాయిలో 22 రాష్ట్రాల బాల బాలికల జట్లు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ బాల బాలికల జట్లు విశేష ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించాయి. పెద్దాపురపాడు జడ్‌పి హైస్కూల్ పదవ తరగతి విద్యార్థి దేగల వీర వెంకట దుర్గాప్రసాద్, బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని యామిని బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా వారిని హెచ్ఎం శ్రీనివాస్, ఎన్‌సిసి ఉపాధ్యాయులు టివెంకట్రావు, తదితర ఉపాధ్యాయులు అభినందించారు.



కబడ్డీ టీంకు ఎంపికైన క్రీడాకారులు

'నన్నయ'కబడ్డీ టీంలో సామర్లకోట క్రీడాకారులు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఆదికవి నన్నయ యూనివర్సీటీ కబడ్డీ జట్టులో కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన శ్రీ భీమేశ్వర స్పోర్ట్స్, రిక్రియేషన్ క్లబ్ క్రీడాకారులు చంద్రశేఖర్, మణికంఠ, రవింద్రనాథ్‌లు ఎంపికయినట్టు వేట్లపాలెం కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొండపల్లి శ్రీను బుధవారం తెలిపారు. వీరు ఈ నెల 7,8,9 తేదీలలో బెంగుళూరు సిటీ యూనివర్సీటీలో జరిగే సౌట్ జోన్ ఇంటర్ యూనివర్సీటీ కబడ్డీలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు తెలుగు టైటాన్స్ కోచ్ సాయి ప్రసాద్, ప్రో కబడ్డీ అంపైర్ బోగిళ్ళ మురళి కుమార్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొండపల్లి శ్రీను, ఎస్‌బిఎస్ఆర్ క్లబ్ అధ్యక్షులు తాళ్ళూరి వైకుంఠం, క్లబ్ కార్యదర్శి నిమ్మకాయల కిరణ్, క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి గండేపల్లి

గండేపల్లి మండలం పి.నాయకంపల్లి కి చెందిన తాడేపల్లి లావరాజు భార్య పిల్లలతో కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో తన పుట్టింట్లో ఉండి కాపురానికి రావడం లేదు. దీంతో ఈనెల 24న లావరాజు గడ్డి మందు తాగాడు. అప్పటి నుండి కాకినాడ ప్రభుత్వా సుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు గండేపల్లి ఎస్ఐ గణేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు తెలిపారు.



నిందితుని సమాచారం చెబితే రూ. 10 వేలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ 3 టౌన్ పరిధిలో సినిమా రోడ్డు కేశవ మిల్క్ షాప్ ప్రాంతంలో గల ఒక ఇంటిలో దొంగతనానికి పాల్పడిన నిందితుడు నగదును దోచుకుపోయాడని, నిందితుని ఆచూకీ తెలిపిన వారికి రూ.10,000 బహుమతితో పాటుగా తెలిపిన వారు వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పి రవీంద్రనాథ్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. నిందితుడి ఛాయా చిత్రం విడుదల చేశామని, సమాచారం తెలిసినవారు కాకినాడ డిఎస్‌పి 9440796505, కాకినాడ 3 టౌన్ ఇన్‌స్పెక్టర్ 9440796542 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం



ధాన్యం పట్టుబడి ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతు ందని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అమలాపురం ఆర్‌డిఒ బి.వసంత రాయుడు సూచించారు. నంగవరంలో రైతు ధాన్యం పట్టుబడి కార్యక్రమాన్ని బుధవారం ఆర్‌డిఒ వసంతరాయుడు, తహశీల్దార్ జె. వెంకటేశ్వరిలు పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఏ ఒక్క రైతు కూడా తన పంటని కనీస మద్దతు ధర కన్నా తక్కువ అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. దళారులు,మధ్య వర్తులు, మిల్లర్ల చేతిలో రైతులు నష్టపోకూడదని ఎటువంటి మోసాలకు తావు ఉండకుండ ఆర్ బి కె లకు ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి-రాజోలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాదరావు సూచించారు. రాజోలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిపి కేతా శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజోలు నియోజకవర్గానికి విద్యుత్ శాఖ ద్వారా రూ.4 కోట్ల నిధులు ఉన్నాయని, సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బంది ప్రతిపాదనలు చేసి పనులు ప్రారంభించాలన్నారు. పంచాయతీ పనులకు సంబంధిత రాజ్ శాఖ సహకరించడం లేదని కడలి సర్పంచ్ చొప్పల గుణనాథ్ ఎంఎల్ఎ దృష్టి కి తీసుకురాగా ఎంఎల్ఎ పంచాయతీ రాజ్ శాఖ ఎఇకి పలు చూచనలు చేశారు. గ్రామల్లో పలు శాఖల అంశాల పై చర్చ జరిగిన అనంతరం సమావేశంలో తహశీల్దారు బి.మురళీ ముక్తేశ్వరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు మట్టా శైలజా, ఎంపిడిఒ కుమార్, వైస్ ఎంపిపి లు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు డిటికి అభినందనలు

ప్రజాశక్తి - ఆలమూరు



డిటి జానకిని సత్కరిస్తున్న దృశ్యం

స్థానిక డిప్యూటీ తహశీల్దార్‌గా ఎం.జానకి రాఘవ బాధ్యతలు స్వీకరించడంతో ఆమెకు చెముడులంక వైసిపి నేతలు ఆధ్వర్యంలో బుధవారం అభినందనలు తెలిపి సత్కరించారు. ఆలమూరులో ఆర్ఐగా పనిచేస్తున్న ఆమెను డీటీ గా నియమించడంపై పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసీపీ గ్రామ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు, నాయకులు అడబాల వీర్రాజు, దొండపాటి చంటి, నాగిరెడ్డి సత్యనారాయణ, తమ్మన హరి, దొండపాటి వెంకట్రామయ్య, రాయుడు వెంకటేష్, సుంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మ్యాథ్స్ క్లబ్‌లో పాల్గొన్న విద్యార్థులు

తాపేశ్వరం శ్రీచైతన్యలో మ్యాథ్స్ క్లబ్

ప్రజాశక్తి - మండపేట

తాపేశ్వరం శ్రీ చైతన్య స్కూల్లో 'మ్యాథ్స్ క్లబ్' ను ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బుధ వారం ఆవిష్కరి ంచారు. ప్రిన్సిపల్ మాట్లా డుతూ గణితంలో విద్యార్థు లకు మెలకువలను పూర్తి స్థాయిలో బోధించడంలో భాగంగా మ్యాథ్స్ క్లబ్ ను ఏర్పాటు చేసామన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులందరు గణితంపై పట్టు సాధించాలని ఉద్దేశ్యంతో ఈ మ్యాథ్స్ క్లబ్ ను నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో ఉన్న మూడుదశలు పూర్తి అనంతరం విజేతలకు తరువాత విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. కార్యక్రమంలో రీజనల్ ఇన్చార్జ్ నరేష్, వైస్ ప్రిన్సిపల్ రాము, ప్రైమరీ ఇన్చార్జ్ ఉమ, డీన్ అరణ్, సి- ఇన్చార్జ్ లీలాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బంకులో గాలి పంపు పరిశీలిస్తున్న అధికారులు

కేశవరం పెట్రోల్ బంక్‌లో తనిఖీలు

ప్రజాశక్తి -మండపేట

కేశవరంలో శ్రీ వెంకట భాగ్యలక్ష్మి ఏజెన్సీస్ పెట్రోల్ బంక్ లో సివిల్ సప్లై అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. కొండ గుంటూరు గ్రామానికి చెందిన వాహనదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు ఎఎస్ఒ ప్రతాపరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఎయిర్ పంపు పని చేయడం లేదని టాయిలెట్స్ కు వెళ్లనివ్వలేదని సంబంధిత విషయాలపై ఇక్కడ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట మండలాల్లో 19 పెట్రోల్ బంకులు ఉన్నాయన్నారు. బంకు యాజమాన్లు నిబంధనలు పాటించుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలో అన్ని బంకులను పర్యవేక్షణ చేపడతామన్నారు. ఈయన వెంట ఎంఎస్ఒ సుబ్బరాజు ఉన్నారు.

ప్రమాద బీమా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

టేకి యూనియన్ బ్యాంకు వద్ద బుధవారం మృతుల కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా చెక్కులను పంపిణీ చేశారు . మాచర మట్ల గ్రామానికి చెందిన ఖాతాదారుడు గుత్తుల శ్రీనివాస్ నారాయణమూర్తి ఇటీవల మృతి చెందాడు. ఆమె భార్య గుత్తుల లలితకు ఎస్‌యుడి ఇన్సూరెన్స్ ద్వారా రూ.2 లక్షలు అందజేశారు. అలాగే టేకికి చెందిన ఖాతాదారులు చోడే మంగ ఇటీవల మృతి చెందగా ఆమె భర్త లక్ష్మయ్యకు ప్రమాద బీమా రూ.2లక్షల చెక్కులను బ్యాంక్ మేనేజర్ ఎ.బెనర్జీ, సబ్ మేనేజర్ పి.వాసు అందజేశారు.

ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర ప్రధాన ఆర్థిక వనరుల్లో ఒకటైన ఆక్వా రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా జనసేన పార్టీ ఆధ్వర్యంలో అమలాపురంలో ఆక్వా రైతులతో ర్యాలీ ఆందోళన నిర్వహించారు. జిల్లా నాయకులు పంతం నానాజీ, డీఎంఆర్ శేఖర్, అమలాపురం నియోజకవర్గ ఇంచార్జ్ శెట్టిబత్తుల రాజబాబు, కొత్తపేట ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, ముమ్మిడివరం ఇంచార్జ్ పితాని బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ లో డిమాండ్‌లపై వినతిపత్రం సమర్పించారు.



మద్యంబాటిళ్లు ధ్వంసం చేస్తున్నపోలీసు సిబ్బంది

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

జిల్లా ఎస్‌పి సూచనల మేరకు బుధవారం ఎస్ఇబి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్‌తో పాటు అమలాపురం రూరల్ సిఐ సమక్షంలో రూ.76,400 విలువ చేసే 758 ఐఎంఎల్ బాటిళ్లు, 3 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ పరదేశి సిబ్బంది తో కలిసి 30 ఎక్సైజ్ కేసులకు సంబంధించిన బాటిళ్లను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. సిఐ,ఎస్ఐ, పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్‌పి అభినందించారు.



సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాఘవరాజు

హైస్కూల్లో సైన్స్ ఫెయిర్ ప్రారంభం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మండల కేంద్రంలో ఉన్న జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో సైన్స్ ఫెయిర్ ను స్థానికసర్పంచ్ దంతులూరి రాఘవరాజు బుధవారం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలను రూపొందించారు. కార్యక్రమానికి ముమ్మిడివరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విత్తనాల శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు డిబి.వెంకటరామయ్య, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రేవు సౌరెడ్డి, హెచ్ఎం వీధి సురేష్ బాబు, రాయపురెడ్డి బాబి, గ్రామ పెద్దలుపాల్గొన్నారు.